ONE PERSON CAN MAKE DIFFERENCE
B.K. YADAV FOUNDATION

# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
నవంబర్ 6, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-



## దేశంలో తీవ్రస్థాయిలో కుల వివక్ష

**అనేక మంది జీవితాలను నాశనం చేస్తోంది**

**దీనిపై సవాల్‌కు మోదీ ముందుకు రావట్లేదేం?**

**కులగణనపై సంప్రదింపుల సదస్సులో రాహుల్**

**బీసీలకు న్యాయమైన రిజర్వేషన్లు అందిస్తాం**

**కులగణన మా ప్రభుత్వ బాధ్యత: సీఎం రేవంత్**

కులవివక్ష, కులవ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. మంగళవారం సాయంత్రం నగరానికి వచ్చిన ఆయన.. బోయిన్‌పల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.


హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న కులగణన.. దేశానికే ఒక నమూనా కానుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇక్కడ చేపట్టే కులగణనలో ఏమైనా లోటుపాట్లు జరిగితే.. దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించేటప్పుడు వాటిని సరి చేసుకుంటామని చెప్పారు. ఈ కులగణన ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంభాషణలాగా ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన కార్యక్రమం చేపట్టడం పట్ల తాను గర్వపడుతున్నానని, రాష్ట్ర నాయకత్వాన్ని అభినందిస్తున్నానని చెప్పారు. మంగళవారం టీపీసీసీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణనపై నిర్వహించిన సంప్రదింపుల సదస్సుకు రాహుల్‌గాంధీ హాజరయ్యారు. వివిధ సంఘాలు, వర్గాల నుంచి కులగణనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం సదస్సునుద్దేశించి రాహుల్ మాట్లాడుతూ.. దేశంలో కులవివక్ష చాలా తీవ్రంగా, లోతుగా ఉందన్నారు. రాజకీయ, న్యాయ, కార్పొరేట్ వ్యవస్థలు సహా అన్ని చోట్లా ఈ వివక్ష ఉందని, దానిని ఎదుర్కొంటున్నవారికి మాత్రమే ఆ బాధ తెలుస్తుందని అన్నారు. అనేక మంది జీవితాలను, ఆత్మవిశ్వాసాన్ని ఇది నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందన్న విషయాన్ని అందరూ అంగీకరిస్తారని, అయితే అది ఏ స్థాయిలో ఉందో లెక్కించి దేశ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం

(మిగతా 2వ పేజీలో)

## కుదేలవుతున్న నిర్మాణ రంగం..

**అనాలోచిత నిర్ణయాల వల్లే ఈ దుస్థితి..**

**రియల్టర్ల తరపున అసెంబ్లీలో ప్రశ్నిస్తాం: కేటీఆర్**




హైదరాబాద్ , నవంబరు 5 : "రియల్ ఎస్టేట్ రంగం గురించి నాకంటే ఎక్కువ ఎవరికి తెలియదని రేవంత్‌రెడ్డి చెప్పిండు.. సీఎం పదవంటే గుంపు మేస్త్రీ పోస్టు అన్నడు.. ఇప్పటివరకు నిర్మాణరంగానికి మేలు జరిగే ఒక్క నిర్ణయం తీసుకోలేదు. పక్కకు తీసుకెళ్లి మాట్లాడితే బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు ఏడుపొక్కటే తక్కువ. వాళ్లు అధికారంలోకి వచ్చి 11 నెలలైంది. అభివృద్ధి ఎక్కడ..? రాష్ట్రంలో ఏంజరుగుతోంది..? 24 గంటల విద్యుత్తు సరఫరానూ అందించడంలేదు" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ రియల్టర్ల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో నిర్వహించిన సమావేశంలో, ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. "తెలంగాణ మీద అవగాహన లేని వారి

(మిగతా 2వ పేజీలో)

## కేంద్ర నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు!

తరుగు, తాలు సమస్య ఉండదు: ఉత్తమ్



## భద్రాద్రి కొత్తగూడెంలో 10 కోట్లతో సీవోఈ!


తుమ్మల ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం

సహజ, సేంద్రియ వ్యవసాయానికి ఊతం



## రాహుల్.. ఆరు గ్యారెంటీల అమలు ఏమైంది?

తెలంగాణ మోడల్‌పై మహారాష్ట్రలో ప్రకటనలా?: సంజయ్



## అంతులేని ఉత్కంఠ

**అమెరికా ఎన్నికల్లో భారీగా ఓటింగ్**





**కిక్కిరిసిన పోలింగ్ బూత్‌లు**

**కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ హోరాహోరీ**

**తొలి ఫలితంలో చెరి సగం.. డిక్స్‌విల్లేలో చెరో 3 ఓట్లు**

వాషింగ్టన్: అమెరికా చరిత్రలోనే అత్యంత హోరాహోరీగా సాగిన ప్రచార ఘట్టానికి తెర పడింది. అధ్యక్ష ఎన్నికల్లో అతి కీలకమైన పోలింగ్ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంల్లో నిక్షిప్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం (భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30) నుంచే పోలింగ్ బూత్‌ల ముందు జనం భారీగా బారులు తీరారు. అమెరికాలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సమయానికి పోలింగ్ మొదలవుతుంది. కనెక్టికట్, వ్యోమింగ్, ఇండియానా, కెంటకీ, మైన్ వంటి రాష్ట్రాల్లో ఉదయం ఆరింటికిబీ అరిజోనా, అయోవా, లూసియానా, విస్కాన్సిన్ తదితర రాష్ట్రాల్లో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్, ఆమె రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతున్నట్టు ఓటింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. దాంతో ఎవరు గెలుస్తార్నది రాజకీయ పండితుల అంచనాలకు కూడా అందడం లేదు. ఈసారి స్వింగ్ స్టేట్స్‌తో పాటు పలు ఇతర రాష్ట్రాల్లో కూడా గెలుపోటముల మధ్య తేడా అతి స్వల్పంగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అభ్యర్థులిద్దరిలో ఎవరు గెలిచినా రికార్డే కానుండటం విశేషం. హారిస్ నెగ్గితే అమెరికాలో అత్యున్నత పీఠాన్ని అధిష్ఠించిన తొలి మహిళగా నూతన చరిత్ర సృష్టిస్తారు. నల్లజాతి, ఆసియా, భారత మూలాలున్న తొలి అధ్యక్షురాలు కూడా అవుతారు. అదే ట్రంప్ గెలిస్తే గత 132 ఏళ్లలో ఒకసారి అధ్యక్షునిగా చేశాక కొన్నేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆ పదవి చేపట్టిన తొలి వ్యక్తిగా రికార్డులకెక్కుతారు. ప్రచారం పొడవునా వారి మధ్య తీవ్ర విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, వాదనలు సాగడం తెలిసిందే. 16 కోట్ల పై చిలుకు ఓటర్లలో సగానికి సగం, అంటే దాదాపు 8 కోట్ల మంది ఈసారి ముందస్తు, పోస్టల్ తదితర పద్ధతుల్లో ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. మంగళవారం సాయంత్రం ఆరింటికి (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11.30కు) పోలింగ్ ప్రక్రియ

(మిగతా 2వ పేజీలో)

## సగం భూములు బాంబులు వేసి, భయపెట్టి లాక్కున్నవే: పవన్ కల్యాణ్

పల్నాడు జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్

సరస్వతి పవర్ కంపెనీ భూముల పరిశీలన

బాంబులు వేసి, భయపెట్టి భూములు రాయించుకున్నారని ఆరోపణ



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ భూములను పరిశీలించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని జగన్ సాగించిన దోపిడీకి నిదర్శనం సరస్వతి పవర్ కంపెనీ అని వ్యాఖ్యానించారు. ఎస్సీ కుటుంబాలకు చెందిన 24 ఎకరాలు భయపెట్టి తీసుకున్నారని వెల్లడించారు. ఈ విధంగా లాక్కున్న భూముల్లో ఒక్క వేమవరం మండలంలోనే 20 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు అండగా ఉంటామని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. 400 ఎకరాల అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మార్చేశారని ఆరోపించారు. రైతుల వద్ద నుంచి

(మిగతా 2వ పేజీలో)

# కుదేలవుతున్న నిర్మాణ రంగం..

అనాలోచిత చర్యలతో రాష్ట్రంలోని అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. హైడ్రా ఒక బ్లాక్‌మెయిల్ దుకాణం. సీఎం కుర్చీ కాపాడుకోవాలంటే.. ఢిల్లీకి పైసలు పంపాలి. పంపకపోతే వాడు ఊరుకోడు. హైడ్రా పేరు చెప్పి బిల్డర్లను పిలుస్తున్నడు. బెదిరిస్తున్నడు. అందుకే మార్కెట్ ఆగమాగం జగన్నాథం. ఎవ్వరి దగ్గరా పైసల్లేవు.. రేవంత్‌రెడ్డి, ఆయన అన్న వద్ద ఉండొచ్చు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. శక్తికి మించి పెట్టుబడులు పెట్టామని, తమ భూములు అమ్ముడుపోవడం లేదని, పరిస్థితి ఇలానే ఉంటే చిన్న బిల్డర్లు పూర్తిగా చితికిపోతారని, ఇటీవల తనను కలిసిన ఓ బిల్డర్ చెప్పారన్నారు. అనుమతులు తీసుకోవడమూ ఇప్పుడు బిల్డర్లకు కష్టంగా మారిందని, ప్రజల చేతుల్లో డబ్బులు లేకుండాపోయాయని, దీనికి కారణం ప్రభుత్వ తీరే అని విమర్శించారు. రైతుబంధు వేస్తే పన్నుల రూపంలో ఆ డబ్బు ప్రభుత్వానికే వస్తుందని, మార్కెట్లో లావాదేవీలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది బీఆర్ఎస్ అని రేవంత్‌రెడ్డికీ తెలుసని, తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతికార చర్యలంటూ పిచ్చి ఆలోచనలు చేయలేదని, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టామని చెప్పారు. గతంలో బంగారం, బ్యాంకు డిపాజిట్లు చేసే వర్గాలు భూమి మీద పెట్టుబడి పెట్టడం మొదలుపెట్టాయని, ఇప్పుడు ఆ వర్గాల వాళ్లంతా ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఆ పార్టీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, నల్లగొండలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముందు కొందరు నాయకులు అసహనం వ్యక్తం చేశారన్నారు. రియల్టర్ల ఇబ్బందులపై అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. రెరాను సంప్రదిస్తూ లీగల్ ఓపినియన్ తీసుకొని రియల్టర్ల ఫోరం మరింత బలపడాలని కేటీఆర్ సూచించారు.

### ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5 వేలివ్వండి

'అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్‌కు ప్రచారానికి వచ్చిన రాహుల్‌గాంధీ ఆటోలో అజారుద్దీన్‌తో కలిసి ప్రయాణించి డ్రైవర్లకు రంగుల కలలు చూపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది' అని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలోని 6.5 లక్షల మంది ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని, గతంలో ఖర్చులుపోను నిత్యం రూ.800 వరకు మిగలగా.. ఇప్పుడు రూ.200-300 గిట్టుబాటయ్యే పరిస్థితి కూడా లేదన్నారు. శాసనసభలో ఆత్మహత్యలు చేసుకున్న డ్రైవర్ల పేర్లతో సహ చెప్పామని, అయినా ప్రభుత్వం ఆదుకోలేదని మండిపడ్డారు. యేడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని, మానవీయ దృక్పథంతో ప్రతి నెలా ఆటో డ్రైవర్లకు రూ.5 వేలు ఇవ్వాలని కోరారు. ఎన్ని కేసులు పెట్టినా.. జైల్లో పెట్టినా.. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతామని కేటీఆర్ అన్నారు.

### మీరూ కంట్రోల్ చేయలేదు.. ఓ డ్రైవర్ ఆందోళన

మహాధర్నాలో కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ ఆటో డ్రైవర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓలా, ఊబర్ ఇతర సంస్థలు తక్కువ కమీషన్లు ఇస్తున్నాయని, ఆ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ విషయం మీ దృష్టికి తీసుకువచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. మేం మీ కోసం వచ్చాం.. అందరం కలిసి సమస్యలు పరిష్కరించుకుందాం.. మాతో పంచాయతీ పెట్టుకుంటే ఏం వస్తది. ఊరుకో అని సూచించారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్రం పిచ్చోడిచేతిలో రాయిలా మారిందని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. పాలనా దక్షతలోపం.. ఒక విజన్ లేకపోవడం, రియల్‌రంగంపై హైడ్రా వేటు.. ముందు చూపులేని నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయానికి పోటు అని పేర్కొన్నారు.

# దేశంలో తీవ్రస్థాయిలో కుల వివక్ష

ఉందని పేర్కొన్నారు. తాను ఈ విషయాన్ని అడిగితే.. దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానంటూ ప్రధాని మోదీ, బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిజం మాట్లాడితే దేశాన్ని విభజించినట్లా? అని ప్రశ్నించారు.

### వాస్తవం బహిర్గతం కావాలి..

దేశంలోని అన్ని మతాలు ప్రాథమికంగా చెప్పేది సత్యం, అహింస అని, అందుకే దేశంలో కుల వివక్ష ఉందన్న సత్యం బహిర్గతం కావాలని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీలు, మహిళలు, ఇతరులు ఎంత మంది ఉన్నారో లెక్కించడంతో పాటు ఆయా వర్గాలకు దేశ సంపద ఏ మేరకు పంపిణీ జరిగిందన్నదీ తెలుసుకోవాలంటున్నామని పేర్కొన్నారు. అలాగే కార్పొరేట్, న్యాయ వ్యవస్థల్లో, ఆర్మీలో ఆయా వర్గాలవారు ఏ మేరకు ఉన్నారు, జనరల్ కేటగిరీలో పేదలు ఎంత మంది ఉన్నారన్నదీ వెలికి తీయాలంటున్నామని తెలిపారు. కులగణన.. ఎక్స్‌రే లాంటిదని పేర్కొన్నారు. కుల వివక్ష ద్వారా ప్రయోజనం పొందుతున్నవారే.. కుల వివక్ష ఏ మేరకు ఉందన్న సత్యాన్ని ప్రజలు తెలుసుకోకూడదని భావిస్తున్నారని ఆరోపించారు. కుల వివక్షపై సవాల్ చేయడానికి ప్రధాని మోదీ ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. కార్పొరేట్ న్యాయవ్యవస్థ, మీడియా రంగంలో దళితులు, ఆదివాసీలు, బీసీలు ఎంత మంది ఉన్నారో తెలుసుకోవడానికి ప్రధాని ఎందుకు వెనకాడుతున్నారని నిలదీశారు. తాము జాతీయ స్థాయిలో కులగణన చేపడతామని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని బద్దలు కొడతామని పార్లమెంటు సాక్షిగా చెప్పానని గుర్తు చేశారు.

### కులగణనలో ప్రశ్నలను ప్రజలే నిర్ణయించాలి

కులగణనలో అడిగే ప్రశ్నలను అధికారులు కూర్చుని నిర్ణయించడానికి తాను వ్యతిరేకమని రాహుల్‌గాంధీ తెలిపారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలన్నది ప్రజలే నిర్ణయించాలని అభిప్రాయపడ్డారు. కులగణన కేవలం కులాల గణన మాత్రమే కాదని, వివక్ష, అసమానతలు ఎదుర్కొంటున్నవారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ఇది సాధనంగా మారుతుందని అన్నారు. ఈ కులగణన వివరాలతో పాలనా విధానం, రాబోయే తరాల భవిష్యత్తు రూపకల్పన జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో వివక్ష ఉందన్నది సత్యమని, దేశం ఆర్థికంగా, సంతోషంలో శక్తివంతమైన దేశంగా మారాలంటే కుల వివక్ష ఎంత మేరకు ఉందో, దాని స్వభావమేంటో తెలుసుకోవాల్సి ఉందని అన్నారు. ఈ సత్యం తెలియకుండా ప్రజలకు జవాబుదారీ అయిన రాజకీయ నాయకుడు వారి వద్దకు పోకూడదని రాహుల్ అభిప్రాయపడ్డారు.

### కులగణన మా ప్రభుత్వ బాధ్యత: రేవంత్

సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కుల గణన సర్వేను తమ ప్రభుత్వం బాధ్యతగా భావించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్‌గాంధీ ఇక్కడికి రావడం గొప్ప విషయమని, ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలని అన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలన్నదే రాహుల్ ఆలోచన అని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించేందుకు అడుగు ముందుకు వేశారని, ఆయన ఇచ్చిన మాటను నెరవేర్చడమే తమ కర్తవ్యమని చెప్పారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు 3076 మంది (9.8%), ఈడబ్ల్యూఎస్ వారు 2774 మంది (8.8%) ఉంటే.. ఓబీసీలు 17,921 మంది (57.11%), ఎస్సీలు 4828 (15.3%) మంది, ఎస్టీలు-2783 (8.8%) మంది ఉన్నారని సీఎం వివరించారు. ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. "మనది రైజింగ్ తెలంగాణ. దేశానికి రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడమే మన కర్తవ్యం. కులగణన పూర్తిచేసి.. బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తాం" అని రేవంత్ అన్నారు.

### మాట నిలబెట్టుకున్న రాహుల్‌గాంధీ..

రాహుల్‌గాంధీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కుల గణన చేపడుతుందని ప్రకటించారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క గుర్తు చేశారు. రాహుల్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపడుతోందని అన్నారు. ఇచ్చినమాటను ఆయన నిలబెట్టుకున్నారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ ఏ విషయంలోనైనా మాట ఇచ్చారంటే అమలు చేసి తీరతారని అన్నారు. కులగణనతో అది మరోసారి నిరూపితమైందని కొనియాడారు. కులగణన చేపట్టడం ద్వారా దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కాగా, కులగణనను 2025 జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని ఈ సదస్సులో తీర్మానాన్ని ఆమోదించారు. సదస్సులో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా 500 నుంచి 600 మంది దాకా కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొ పాల్గొన్నారు. సాయంత్రం 4.45 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం చేరుకున్న రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. సదస్సులో పాల్గొన్న అనంతరం రాహుల్ ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి వెళ్లి పోయారు.

### కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

బోయిన్‌పల్లి: కులగణనపై సంప్రదింపుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలకు పాస్‌లు లేకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ రాక నేపథ్యంలో చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి భారీ జనసమీకరణ చేశారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో సుమారు 5వేల మందిని సమీకరించారు. దారిలో కటౌట్లు ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి రాహుల్‌కు స్వాగతం పలికారు. అయితే పాస్‌లు లేనివారిని పోలీసులు అనుమతించలేదు. ఇదిలా ఉండగా.. రాహుల్ కాన్వాయ్ వెళ్లే రహదారిలో పలు చోట్ల బీఆర్ఎస్ నాయకులు.. పారిశ్రామికవేత్త అదానీతో సీఎం రేవంత్ కలిసి ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం తెల్లవారుజామున వాటిని తొలగించారు. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన కొందరు బీఆర్ఎస్ నేతలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి.. రాహుల్ సమావేశం ముగిసిన తర్వాత విడిచిపెట్టారు.

# అంతులేని ఉత్కంఠ





పూర్తవుతుంది. ఆ వెంటనే రాష్ట్రాలవారీగా ఎక్కడికక్కడ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టినా తుది ఫలితం తేలడానికి కొద్ది రోజులు పట్టవచ్చు. అయితే విజేత ఎవరన్న దానిపై ఓటింగ్ ముగిసిన కొద్ది గంటల్లోనే స్పష్టత వచ్చే అవకాశం లేకపోలేదు. దాంతో ఇక అందరి కళ్లూ ఫలితాలను తేల్చడంలో కీలకమైన స్వింగ్ రాష్ట్రాలపైనే ఉన్నాయి. మహిళల ఓటు కూడా ఈసారి కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.

### అమెరికా చరిత్రలోనే కీలకమైన రోజు: ట్రంప్

మంగళవారాన్ని అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన రోజుగా ట్రంప్ అభివర్ణించారు. "పోలింగ్ రోజు వచ్చేసింది! భారీ సంఖ్యలో వచ్చి ఓటేయండి" అంటూ లక్షలాది మంది అభిమానులు, మద్దతుదారులకు మంగళవారం ఆయన ఈ మెయిళ్లు పంపారు. అమెరికాను మరోసారి గొప్ప దేశంగా మలచుకుందాం. మీరు ఓటేయకుండానే వెనుదిరగాలని రాడికల్ కమ్యూనిస్టు డెమొక్రాట్లు ఆశిస్తున్నారు. మనమంతా కలిసి వారి ఆశలను వమ్ము చేద్దాం" అంటూ పిలుపునిచ్చారు.

### జీవనవ్యయం తగ్గిస్తా: హారిస్

ప్రెసిడెంట్‌గా తన విజయం ఇప్పటికే ఖాయమైపోయిందని హారిస్ పేర్కొన్నారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించడం, వెన్ను విరిగిన వలసల విధానాన్ని సరిచేయడం తన తొలి ప్రాథమ్యాలని ప్రకటించారు. మంగళవారం ఆమె పిట్స్‌బర్గ్‌లో న్యూస్‌రేడియో మార్నింగ్ షోలో పాల్గొన్నారు. ధరాభారానికి ముకుతాడు వేసేందుకు తనవద్ద ఇప్పటికే ప్రణాళిక సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

### ఫ్లోరిడాలో ఓటేసిన ట్రంప్

ట్రంప్ ఫ్లోరిడాలో ఓటేశారు. మంగళవారం ఉదయం భార్య మెలానియాతో కలిసి తన నివాసం సమీపంలోని పామ్‌బీచ్‌లోని పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. హారిస్ ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడం తెలిసిందే. అధ్యక్షుడు జో బైడెన్ కూడా తన స్వస్థలం డెలావెర్‌లో కొద్ది రోజుల ముందే ఓటేశారు.

### డిక్స్‌విల్ నాచ్‌లో తొలి ఫలితం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓ బుల్లి కౌంటీలో 'తొలి ఫలితం' వచ్చేసింది. పోలింగ్ మొదలైన కొద్ది గంటల్లోనే అక్కడ కౌంటింగ్ కూడా పూర్తవమే ఇందుకు కారణం. న్యూహాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్ నాచ్‌లో కేవలం ఆరుగురు ఓటర్లే ఉన్నారు. అక్కడ 60 ఏళ్లుగా అర్ధరాత్రి ఓటు హక్కు వినియోగించుకునే సంప్రదాయముంది. దాని ప్రకారం మంగళవారం మొదలవుతూనే (సోమవారం అర్ధరాత్రి దాటగానే) పోలింగ్ మొదలైంది. ఆరుగురు ఓటర్లే ఉండటంతో కాసేపటికే పోలింగ్, ఆ వెంటనే కౌంటింగ్ కూడా ముగిశాయి. హోరాహోరీ పోరుకు అద్దం పట్టేలా హారిస్, ట్రంప్‌కు చెరో మూడు ఓట్లు పడటం విశేషం. కెనడా సరిహద్దు సమీపంలో ఉండే డిక్స్‌విల్‌కు అమెరికా ఎన్నికల్లో తొలి ఫలితం వచ్చే ప్రదేశంగా పేరుంది. అమెరికాలో కొన్ని రాష్ట్రాల్లో ఉదయం ఆరింటికి, మరికొన్నింట్లో 7, 8, 9 గంటలకు పోలింగ్ మొదలవుతుంది.

## తప్పు చేసి.. ఎదురు దాడా?

పూర్తి చేసేందుకు రూ.10,911.06 కోట్లు కావాలంటూ 2022 జనవరి పదో తేదీన కేంద్రాన్ని కోరారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2023 అక్టోబరులో కేంద్ర జల సంఘం తొలి దశకు ఆమోదం తెలిపిందన్నారు. సవరించిన అంచనా వ్యయం రూ. 30,436.95 కోట్లకు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర జలశక్తి శాఖ సమ్మతించిందని చెప్పారు. సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసేలా వ్యవహరించి.. ప్రజలు ప్రతిపక్ష హోదాను కూడా ఇవ్వకపోయేసరికి.. తాను చేసిన తప్పులన్నిటినీ కూటమి ప్రభుత్వంపైకి నెట్టి సొంత పత్రికలో రాసుకుంటున్నాడని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరు ఎత్తులో నిర్మిస్తామని తేల్చిచెప్పారు.

## కేంద్ర నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు!

### ::: తరుగు, తాలు సమస్య ఉండదు: ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 5 : కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. బ్యాంకు గ్యారెంటీ తీసుకున్న తర్వాత మిల్లర్లకు ధాన్యం అప్పగిస్తామన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించగానే బ్యాంకు గ్యారెంటీలను మిల్లర్లకు తిరిగి ఇచ్చేస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైస్ మిల్లుల పరిశ్రమకు అండగా ఉంటామని, ప్రభుత్వం, మిల్లర్లు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని ఉత్తమ్ సూచించారు. తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోళ్లలో తరుగు, తాలు సమస్యలు లేకుండా చేస్తామని తెలిపారు. ఈ సీజన్‌లో కోటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, దేశంలో ఇదో రికార్డని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.30 వేల కోట్లు అవసరమని అంచనా వేశామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. 32 జిల్లాల్లో 7,572 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 3,309 రైస్‌మిల్లులు సేకరణలో భాగస్వాములవుతాయని పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ఏ మాత్రం తేడా వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో 10 కోట్లతో సీవోఈ!

### తుమ్మల ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం.. సహజ, సేంద్రియ వ్యవసాయానికి ఊతం

హైదరాబాద్, నవంబరు 5 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సహజ, సేంద్రియ వ్యవసాయానికి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)' ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజూరు చేయాలన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తికి ఆమోదం తెలిపింది. ఈ విషయంపై తుమ్మల గత నెలలో కేంద్రానికి లేఖ రాశారు. దీనికి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందిస్తూ.. ఎంఐడీహెచ్ పథకంలో సహజ, సేంద్రియ వ్యవసాయానికి సీవోఈలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భద్రాద్రి కొత్తగూడెంలో సీవోఈ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ కేంద్రాల్లో ఉద్యాన పంటల రైతులకు శిక్షణ, సహకారం అందుతుందన్నారు. అలాగే పామాయిల్ సాగులో జాతీయస్థాయి లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం కృషిని చౌహాన్ అభినందించారు. తుమ్మల విజ్ఞప్తి మేరకు కేంద్ర అధికారుల బృందం త్వరలో తెలంగాణలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం, పామాయిల్ రైతులతో సంప్రదింపులు జరుపుతుందన్నారు. తుమ్మల ప్రతిపాదనల మేరకు పామాయిల్ గెలల ధర పెరుగుదలకు ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచామని చౌహాన్ తెలిపారు. కాగా, ఈ నిర్ణయంతో పామాయిల్ గెలల ప్రస్తుత ధర 19,144కు చేరిందని తుమ్మల పేర్కొన్నారు. రూ.20 వేలు కూడా దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ ధర రూ.1,25,000 తగ్గకుండా ఉండేందుకు దిగుమతి సుంకాన్ని పెంచుతూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పెరిగిన ధరలతో రాష్ట్రంలో చాలామంది రైతులు పామాయిల్ సాగు వైపు చూసే అవకాశం ఉందన్నారు.

## రాహుల్.. 6 గ్యారెంటీల అమలు ఏమైంది?

### తెలంగాణ మోడల్‌పై మహారాష్ట్రలో ప్రకటనలా?: సంజయ్

సిరిసిల్ల, నవంబరు 5 : 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టుకొని తెలంగాణకు వస్తున్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. రాహుల్ గాంధీకి ఆరు గ్యారెంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా..?' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పిన తర్వాతే రాహుల్ తెలంగాణకు రావాలని అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు సంజయ్ శంకుస్థాపన చేశారు. రుద్రంగి, కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలతో కర్ణాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్.. మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్ధాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శించారు. తెలంగాణలో గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు, ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటూ మహారాష్ట్రలోని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. గతంలో కేసీఆర్ ఇలాగే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజాబ్‌లో పంచారని.. కాంగ్రెస్ నేతలు ఆయన్ను మించిపోయారని మండిపడ్డారు. ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతూ మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ పైసలను వాడుకుంటారా..? అని విమర్శించారు. బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరిగే అవకాశం ఉందని పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బోలాసింగ్ తెలిపారు. పార్టీ సంస్థాగత ఎన్నికల పర్వం జనవరి వరకు కొనసాగుతుందని చెప్పారు.

## సగం భూములు బాంబులు వేసి, భయపెట్టి లాక్కున్నవే: పవన్ కల్యాణ్



కొనుగోలు చేసిన భూములు 1,384 ఎకరాలు అని వెల్లడించారు. 1,083 ఎకరాలు పట్టాభూములు అని,అందులో సగం భూములు బాంబులు వేసి, భయపెట్టి లాక్కున్నవేనని తెలిపారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో భూ సొంతదారుల పిల్లలను చదివిస్తామని, ఉద్యోగాలు ఇస్తామని వైసీపీ నేతలు నమ్మబలికి భూములు రాయించుకున్నారని వివరించారు. సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు రావని తెలుసుకుని, క్యాప్టివ్ పవర్ కంపెనీ అని చెప్పారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. 2009లో 30 సంవత్సరాల లీజుకు తీసుకున్నారని, అధికారంలోకి వచ్చాక ఆ లీజును 50 ఏళ్లకు మార్చేశారని తెలిపారు. ప్రజల ఆస్తులు దోచేసి... ఆస్తుల పంపకాల కోసం అన్నాచెల్లెళ్లు గొడవలు పడుతున్నారని, వైసీపీ నేతల దోపిడీలు బయటికి లాగుతామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం దీనిపై కచ్చితంగా చర్చిస్తుందని, అనుమతులు లేని ఈ పవర్ ప్రాజెక్టును, సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేస్తామని చెప్పారు.



## కుర్మపల్లి లో ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 5

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుర్మపల్లె గ్రామంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన, శ్రీ ఆంజనేయ శివ పంచాయతన యంత్ర విగ్రహ స్థాపన మహోత్సవం కనుల పండువగా మంగళవారం రోజున భక్త జనల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమాన్ దేవాలయంలో వేద పండితుల మంత్రోత్సవాలతో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ సుమలత రాజమల్లు, మాజీ ఎంపీటీసీ బాలె చంద్ర శేఖర్, నామని లక్ష్మి నరసయ్య, చిట్యాల భూమయ్య, అజిత్ రావు, ఉరుమడ్ల వాసు, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, పురోహితులు గురులింగ మఠం వినయ్, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాలుగోన్నారు.



## యాదాద్రి సగర అన్నదాన సత్ర నిర్మాణానికి విరాళాల సేకరణ చేపట్టిన రాష్ట్ర సగర సంఘం-సత్ర సంఘం

యాదాద్రి వార్త మిర్రర్ జిల్లా ప్రతినిధి (గణేష్ సాగర్) శ్రీ యాదాద్రి సగర అన్నదాన సత్ర నిర్మాణానికి విరాళాల సేకరణ ముమ్మరంగా కొనసాగుతుంది. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, సత్ర సంఘం అధ్యక్షులు కెపి రాములు సగర ఆధ్వర్యంలో విరాళాలు సేకరించే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో మంగళవారం విరాళాల సేకరణ చేపట్టారు. దాతలు గుంటి శ్రీనివాస్ సగర, బంగారి బాలరాజు సగర, చీర్లా చెన్నయ్య సగర, వేముల నాగేష్ సగర, అలేటి బుచ్చి బాబు సగర, కె. సత్యనారాయణ సగర, భీసం ఎల్లప్ప సగర, కొమ్ముల వెంకటయ్య సగర, వేముల రాములు సగర, శెన్షెట్టి శ్రీనివాసులు సగర, ఆతినరపు రాములు సగర, గుంటి భాస్కర్ సగర, గుంటి చంద్ర శేఖర్ సగర ల వద్ద విరాళాలు రాయించడంతోపాటు నగదు రూపేనా కొంత మొత్తాన్ని సేకరించడం జరిగింది. రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, సత్ర సంఘం అధ్యక్షులు కేపీ రాములు సగర ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమంలో సత్ర కమిటీ గౌరవాధ్యక్షులు బంగారు నరసింహ సగర, ప్రధాన కార్యదర్శి (మేడ్చల్ జిల్లా సగర సంఘం అధ్యక్షులు) మాదంశెట్టి కృష్ణ సగర, కోశాధికారి (గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు) మోడల రవి సగర, టీఎన్జీవోస్ కాలని సగర సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ సగర, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సగర, ఉపాధ్యక్షులు సత్యనారాయణ సగర, నాయకులు మహేష్ సగర, గుంటి భాస్కర్ సగర, గౌని సాయి కుమార్ సగర, గట్టయ్య సగర తదితరులు ఉన్నారు.

## అద్భుత ఔషధాలు ఉన్న ఈత కల్లు ఉండగా. మద్యం ఎందుకు దండగ దేహానికి అవసరమైన ఖనిజాల్ని అందించడంలో ఈత కల్లు ఎంతో మేలు

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)



తెలంగాణలో దసరా పండుగ వచ్చిందంటే పట్టణ ప్రజలు గ్రామ ప్రజల చూపంత ఈత చెట్ల వైపే ఈత కల్లులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పోషకాలు, ఐరన్ పలు ఇతర ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఇది దేహానికి అవసరమైన కణజాలన్నీ అందించడంలో సహాయపడుతుంది, ఈత కల్లు శరీరానికి తేలికపాటి శక్తిని అందించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది వేసవిలో తాగితే శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.జీర్ణ వ్యవస్థకు మేలు: ఈత కల్లులో సహజమైన ఎంజైములు, ప్రొబయోటిక్స్ ఉంటాయి, ఇవి జీర్ణవ్యవస్థకు సహాయపడతాయి. క్రమం తప్పకుండా తగిన మోతాదులో తీసుకుంటే, ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.తీపి రుచి: ఫెర్మెంటేషన్ కాకముందు తీపి కలిగిన ఈత కల్లు, చక్కని రుచితో, సహజమైన పానీయంగా వినియోగంలో ఉంటుంది.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ బిర్ల ఆయిలయ్య

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో గల ముఖ్యమంత్రి స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు ఈనెల 8వ తేదీన యాదగిరిగుట్ట పర్యటన నేపథ్యంలో పలు విషయాలను చర్చించారు ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు పలు సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు బిర్ల ఆయిలయ్య గారి వెంట బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాదగిరి గౌడ్ పాల్గొన్నారు

# మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్, హెపటైటిస్ బి మిషన్లను అందుబాటులో ఉంచాలి

మిర్యాలగూడ నవంబర్ 5:-( వార్త మిర్రర్ ) మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చికిత్స కొరకు వస్తున్న కిడ్నీ బాధితుల సమస్య పరిష్కారానికై డయాలసిస్ హెపటైటిస్ -బి మిషన్ ను అందుబాటులో ఉంచాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్,కుల వ్యతిరేక పోరాట సమితి (కెవిపిఎస్) కోరాయి. మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కిడ్నీ సమస్య తో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స కొరకు వస్తున్న బాధితులకు డయాలసిస్ హెపటైటిస్ - బి మిషన్ అందుబాటులో ఉంచి వైద్యులకు చికిత్స చేయాలని మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరథ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు పరశురాములు కుర్ర సైదా నాయక్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలు దామరచర్ల ప్రాంతంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, పరిశ్రమల వల్ల వచ్చే కాలుష్యం ద్వారా నీరు గాలి కలుషితమై రోజురోజుకు కిడ్నీస్ బాధితులు పెరిగిపోతున్నారు. కిడ్నీ సమస్యతో మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ కు చికిత్స కోసం వస్తున్న బాధితులకు డయాలసిస్ హెపటైటిస్- బి మిషన్ లేకపోవడం వల్ల సరైన వైద్య సౌకర్యం కల్పించకుండా నల్గొండ, నాగార్జునసాగర్ ప్రభుత్వ ఆసుపత్రికి కిడ్నీస్ బాధితులను తరలించడం వల్ల కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బాధితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాళ్లన్నారు. కొంతమంది బాధితులు మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ లో డయాలసిస్ హెపటైటిస్-బి మిషన్ లేకపోవడం వల్ల ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకొని వైద్యం చేయించుకుంటున్నారని అన్నారు తెలంగాణ




రాష్ట్రంలో ప్రభుత్వం మారితే వైద్యరంగం బలోపేతమైతదని భావించిన పేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు ఈ విషయంపై ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని డయాలసిస్ హెపటైటిస్-బి మిషన్ ను మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ లో అందుబాటులో ఉండేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు జగన్నాయక్ డివైఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వదూద్, పట్టణ కార్యదర్శి న్యూమాన్ నాయకులు వినయ్, వెంకటేష్, రవి, అఫ్రోజ్ పాల్గొన్నారు

## ఎస్సీ వర్గీకరణ అమలుకై జనవరి 19న చలో హైదరాబాద్... మేడి పాపన్న మాదిగ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 5.... సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలను ఏబిసిడిలుగా విభజించాలని కోరుతూ జనవరి 19న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు గౌరవిస్తూ ఎస్సి వర్గీకరణ అమలు చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని పాపయ్య మాదిగ పేర్కొన్నారు. నగరంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, గౌరవాధ్యక్షుడు వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలుకై జనవరి 19న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్త కావస్తున్న ఇప్పటివరకు మాదిగలకు ఎలాంటి సంక్షేమ ఫలాలు ఇవ్వడం లేదని, నామినేటెడ్ పదవుల్లో ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదని తెలిపారు. గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేస్తూ పాదయాత్ర చేపడతామని చెప్పారు. వర్గీకరణ అమలు చేసే వరకు పోరాటం ఆపేది లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రాల శ్రీనివాస్ మాదిగ, గెలవయ్య మాదిగ, బాబురావు



మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, ఆకారపు రుక్కమ్మ, మోహన్, శంకర్, యాదయ్య, జీడి నరసింహ, గంటా సుదర్శన్, మేడి రమణ, యాదగిరి మాదిగ, కుమార్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగారం సుధాకర్, ప్రభాకర్ మాదిగ, ప్రవీణ్ మాదిగ తోపాటు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా రెండోసారి గండికోట ఆనంద్ కుమార్

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ నవంబర్ 5.....జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సికింద్రాబాద్ నూతన అధ్యక్షుడుగా రెండోసారి మానికేశ్వరీనగర్ బస్తీకి చెందిన గండికోట ఆనంద్ కుమార్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి జీహెచ్ఎంసీ గ్రేటర్ హైదరాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ రామకృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా ఆనంద్ కృషి చేస్తూ అందరి మన్నలను పొందుతూ రెండోసారి అధ్యక్షుడుగా ఎన్నిక కావడం హర్షించ తగ్గ విషయం అన్నారు. రెండోసారిగా అధ్యక్షుడిగా అనంద్ కుమార్ ఎన్నిక కావడం పట్ల పలువురు కాంట్రాక్టర్లు హర్షం వ్యకం చేసి అభినందించారు. అనంతరం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా కాంట్రాక్టర్ గా కొనసాగడం ఒక ఎత్తు అయితే కాంట్రాక్టర్ల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం తనపై బాధ్యతను మరింత పెంచిందన్నారు. కాంట్రాక్టర్లకు రావలసిన బకాయిలను సమయానూకూలగంగా వచ్చేలే అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుర్గా వెంకటేష్, కోశాధికారి జి. నరసింహ, సలహాదారులుగా ఎస్. శ్రీనివాస్, ఎం.డి రషీద్, ఎమ్మెస్ కృష్ణ,



ఆర్.యాదయ్య తోపాటు ఉపాధ్యక్షులు ముదావత రాజు, కుంభం వెంకన్న, సంయుక్త కార్యదర్శిగా ఆముల శేఖర్, ఎం.డి ఆజాం, చేవెళ్ల రమేష్, టి వీరమ్మ తోపాటు పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి

## స్కాలర్షిప్ ప్రభుత్వం బిక్ష కాదు-విద్యార్థుల హక్కు.

కల్వకుర్తి నవంబర్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కల్వకుర్తి నగర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఏబీవీపీ నగర కార్యదర్శి అక్కి వంశీ గౌడ్ మాట్లాడుతూ గతంలో ఉన్నటువంటి ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్షిప్లను విడుదల చేయకుండా ఎట్లా అయితే విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిందో ఈ ప్రభుత్వం కూడా ఏర్పాటు అయ్యి దాదాపు సంవత్సరం గడుస్తున్నప్పటికీ కూడా ఒక్క రూపాయి కూడా స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చెయ్యలేకపోవడం సిగ్గుచేటు స్కాలర్షిప్ అనేది ప్రభుత్వం వేసేటటువంటి విద్యార్థులకు బిక్ష కాదు స్కాలర్షిప్లు విద్యార్థుల హక్కు కాబట్టి వెంటనే స్కాలర్షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఒక విద్యార్థి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల తరుణంలో ఆ విద్యార్థి అకాడమీకు సంవత్సరం అయిన తర్వాత కాలేజీ యాజమాన్యాలు రియంబర్స్మెంట్ పూర్తి మొత్తాన్ని చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ మీకు ఇస్తామని చెప్పడం జరుగుతుంది.పేద విద్యార్థులు అంత పెద్ద మొత్తం ఫీజు చెల్లించలేక అక్కడికే స్టడీస్ ని ఆపివేసే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.కొన్ని కాలేజీలలో ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల కానీ తరుణంలో ఎగ్జామ్ ఫీస్ కట్టించుకోకుండా విద్యార్థులను ఇబ్బందికి గురి చేస్తా



ఉన్నారు.కాబట్టి నేను ప్రభుత్వాన్ని ఒకటే డిమాండ్ చేస్తున్నాము వెంటనే స్కాలర్షిప్లు మరియు రియంబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నం అన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్ గౌడ్, స్టేట్ ఎక్సుక్యూటివ్ ప్రశాంత్, ఏబీవీపీ నాయకులు మోహన్, సతీష్,కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.



## యుఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 05 వార్త మిర్రర్ ::::::

దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు బాలు నాయక్ చేతుల మీదుగా యుఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా శాసన్ సభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల క సమస్యల కోసం యూఎస్ఎఫ్ఐ ముందుండి సమస్యల పరిష్కారం చేసే విధంగా ఉండాలని అన్నారు యుఎస్ఎఫ్ఐ జాతీయ కో కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ మొట్టమొదటి అఖిల భారత మహాసభలు 2024 డిసెంబర్ 14,15 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది. యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం 1984 సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ పోరాటల గడ్డమీద ఏర్పడింది. అధ్యయనం ఐక్యత పోరాటం అనే నినాదంతో ముందు సాగుతోంది. దేశంలో అందరికీ సమాన విద్య అవకాశాలు కల్పించాలని విద్యారంగా అభివృద్ధికై వాటి నుంచి నేటి వరకు కృషి చేస్తూ వస్తుంది. దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులను చర్చించి భవిష్యత్తు ఉద్యమాలు కార్చిన రూపొందించుకోవడం ఈ మహాసభ వేదిక కాబోతుంది అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ యూఎస్ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కలమూరి పరుశురాం, పట్టణ అధ్యక్షులు సౌభాన్ నేరడిగొమ్మూ మండల అధ్యక్షులు అడేపు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో 108, 104 సర్వీసుల నుంచి 'అరబిందో' ఔట్!




విశాఖపట్నం వార్త మిర్రర్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 108 (అత్యవసర వైద్యం), 104 (సంచార వైద్యం) సర్వీసుల నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో సంస్థ వైదొలిగే అవకాశాలు ఉన్నాయి.ఈ రెండు సర్వీసుల పనితీరు ఘోరంగా ఉందంటూ ఎన్డీయే ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు అందాయి. నిర్వహణ దారుణంగా ఉందని నిఘా సంస్థలూ ప్రభుత్వానికి నివేదించాయి. బాధ్యతల నుంచి తమకు తాముగా తప్పుకోవాలని లేదంటే తనకు ఉన్న అధికారాల్ని అనుసరించి కఠిన చర్యలు తీసుకుంటామని అరబిందో యాజమాన్యానికి స్పష్టం చేసింది.



## తెలంగాణ నుంచి నేరుగా ఏపీకి చేరుకున్న నాగ సాధు

విశాఖపట్నం వార్త మిర్రర్ మహిళ అఘోరీ విశాఖకు చేరు కున్నారు నాగుల చవితి శుభ సందర్భంగా జోడిగుడ్లపాలెంలోని నాగ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు హిందుత్వాన్ని కాపాడడం మహిళల రక్షణ,గో సంరక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తానని చెప్పారు తన శక్తులు తెలుసుకోవాలంటే హిమాలయాల కు వస్తే చూపిస్తానని ముఖ్యంగా ధర్మ పరిరక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయన కుటుంబానికి తన ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.



# సర్వేను సూపర్వైజర్లు ,ఏన్యూమారేటర్లు పకడ్బందీగా, పారదర్శంగా నిర్వహించాలి లిసబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ, నవంబర్ 5:-( వార్త మిర్రర్ ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల సర్వే అందరికి లబ్ది చేకూరేదని సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు అలసత్వం కూడదని జాగ్రత్తగా చేయాలని, లేకుంటే వారు ఆ హోదాలో పని చేయనక్కర లేదని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ గట్టిగా చెప్పారు. మంగళవారం స్థానిక ఎఆర్సి గార్డెన్స్ లో జరిగిన మున్సిపాలిటికి చెందిన సర్వే సూపర్వైజర్ల, ఏన్యూమరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో సర్వే పనులను అధికారులు, ఉద్యోగులు పనులు సజావుగా చకచకా జరిగిపోతున్నాయని మిర్యాలగూడ మున్సిపాలిటీలోనే వేగం అందుకోవడం లేదని ఆయన అన్నారు. కమిషనర్ బ్లాక్ మ్యాప్ అందించాలని ఆయన కోరారు. ఈ నెల 6 నుండి ఒకొక్క ఎన్యుమరెటర్ బ్లాక్ లోని ఇళ్లను గుర్తించి స్టికర్లు వేయాలని కోరారు. పని జరగడం లేదన్న మాట రావద్దని ఆయన ఆన్నారు. క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో ఉత్సాహంగా సర్వే పకడ్బందీగా పారదర్శకంగా జాగ్రత్తగా చేయాలని ఆయన కోరారు. సంతృప్తికర రెమ్యునరేషన్ ఇస్తామని ఆయన తెలిపారు. అదేవిధంగా ఏమైనా సౌకర్యాలు స్టేషనరి కావాలన్న అందిస్తామని సర్వే మాత్రం పకడ్బందీగా చేయాలని కోరారు.సమావేశంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, టీపిఓ సోమయ్య, టీపిఎస్ అంజయ్య, ఐసీడిఎస్ పిఓ రేఖల మమత, రెవిన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, ఎంఈఓ ఎల్.బాలునాయక్, మెప్మా టీఎంసి పి.బక్కయ్య, సెర్ఫ్ ఎపిఎం కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

# నవంబర్ 7 నుంచి ఐనోన్ చర్చి గ్రేస్ పెస్టివల్స్



సికింద్రాబాద్, వార్తా మిర్రర్ నవంబర్ 5.. తార్నాక ఐనోన్ చర్చి ఆధ్వర్యంలో నవంబర్ 7,8,9,10 తేదీల్లో గ్రేస్ పెస్టివల్స్-2024ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఐనోన్ మినిస్ట్రీస్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్. విలియం కేరి మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నాచారం హెచ్ఎంటీలోని ఏఎన్ఆర్ గార్డెన్ లో నాలుగు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు కృప పండుగులు జరుగుతాయన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ, నవంబర్ 5:-( వార్త మిర్రర్)

నల్గొండ జిల్లా కేంద్రంలో స్టేట్ సివిల్ సప్లై కమిషనర్ డి.ఐస్ చౌహాన్ , జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , జెసి తో మంగళవారం సమావేశం అయిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి . మిర్యాలగూడ నియోజకవర్గంలో రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అవసరమైన మేరకు మండలాల్లో నూతన ఐకెపి సెంటర్లులి ఏర్పాటు చేయాలని అన్నారు . రైస్ మిల్లులకు రైతులు తీసుకొచ్చే ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కేల తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.



# ఒంటరి జీవితానికి మనస్థాపం చెంది వ్యక్తి ఆత్మహత్య -

మిర్యాలగూడ నవంబర్ 5:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం ఉదయం పాతకోటి సైదులు (55)ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలగడప చెరువు వద్ద చేపల కాపలా ఉన్న అతను లక్ష్మీపురంకు ఉదయం 6 గంటలకు వచ్చి 8: 30గంటలకు గ్రామ రామాలయం వద్ద పురుగుల మందు తాగుతుండగా గ్రామస్తులు అడ్డుకుని 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందక ముందే మరణించాడు. ఒంటరి జీవితానికి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారని రూరల్ ఎస్ఐ లోకేష్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుమారులకు అప్పగించారు. కుమారుడు యెలెందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లోకేష్ తెలిపారు.



# తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణుల మౌన ప్రదర్శన

మిర్యాలగూడ నవంబర్ 5:- (వార్త మిర్రర్)ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలకు మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కార్యకర్తలు, కాంగ్రెస్ బిసి నాయకులు మంగళవారం సాయంత్రం మౌన నిరసన ప్రదర్శన నిర్వహించారు. మల్లన్న మిర్యాలగూడలో జరిగిన బిసి గర్జనలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మూతికి నల్ల రిబ్బన్లు ధరించి మౌన నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రాజీవ్ భవన్ నుండి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.బీసీ గర్జన సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు.తక్షణమే పార్టీ అధిష్టానం స్పందించి మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 05 వార్త మిర్రర్ :

దేవరకొండ నియోజక వర్గంలోని ప్రజలు ప్రమాదవశాత్తు బాధపడుతూ మెరుగైనా చికిత్స కోసం ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు చేయూతనిస్తూ, నియోజక వర్గంలోని పలు గ్రామానికి చెందిన 68 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన దాదాపు 17 లక్షల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ప్రజారోగ్యానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీ బాలు నాయక్ అన్నారు.పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పెద్ద మొత్తంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు.నిరుపేదల అభివృద్ధియే లక్ష్యంగా అనేక సంక్షేమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక సంక్షేమాలు పథకాలు చేపట్టబోతున్నమని తెలిపారు.సంక్షేమ పథకాలు,అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందని,అప్లికేషన్ గడువును ఆరు నెలల నుండి సంవత్సరానికి పెంచినా ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు ప్రమాదాల బారిన ఎవరైనా,తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలందరికీ సీఎంఆర్ఆఫ్ అప్లికేషన్లపై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజి ఎంపీపీ జాని యాదవ్, మాజి జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్,బుజ్జి లచ్చిరాం నాయక్,మాజి



మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్,శిరందాస్ కృష్ణయ్య,మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య యాదవ్, నాగభూషణం,బాధ్య నాయక్,రాష్ట్ర నాయకులు హన్మంతు వెంకటేష్ గౌడ్, యుగంధర్ రెడ్డి,వైస్ ఎంపీపీ కాసర్ల వేంకటేశ్వర్లు,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ,కొండల్ యాదవ్, బాబు రామ్ నాయక్,సుభాష్ నాయక్,పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

## బిజెపి భువనగిరి పట్టణ శాఖ అధ్యక్షులు రత్నపురం బలరాం

యాదాద్రి భువనగిరి, నవంబర్ 05(వార్త మిర్రర్): భువనగిరి పట్టణ శాఖ, మండల శాఖ అధ్యక్షులు రత్నపురం బలరాం,చిర్కా సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటను ఐకెపి సెంటర్లు త్వరగా ప్రారంభించి రైతుల వద్ద నుండి వడ్ల కొనుగోలు వెంటనే చేయాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు వరి ధాన్యంపై 500 రూపాయల బోనస్ వెంటనే రైతులకు అందజేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక భువనగిరి తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు రైతులకు పెట్టుబడి సహాయం ఎకరాకు 7500 రూపాయల చొప్పున ఇస్తాన ,రైతులకు, కౌలు రైతులకు ఆర్థిక భరోసా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఎవరికీ ఎలాంటి సహాయం ఇవ్వలేదు రైతును మోసం చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించదు అన్నారు. బిజెపి భువనగిరి పట్టణ శాఖ అధ్యక్షులు రత్నపురం బలరాం మాట్లాడుతూ రూ. 12 వేలు రైతు కూలీల ఖాతాలో జమచేయాలని, రూ. 2 లక్షల రుణమాఫీ వెంటనే ఎటువంటి షరతులు లేకుండా చేయాలని, రూ.15 వేలు రైతు భరోసా వెంటనే అందించాలని, రూ. 500 వరికి అన్ని పంటలకు వెంటనే బోనస్ అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జెన్నెపల్లి శ్యామ్



సుందర్ రెడ్డి ,తాడూరి బాలశంకర్,నాగు వినోద్,యాట వెంకట్, మాజీ కౌన్సిలర్ నరాల శ్రీను,మాటూరి అనిల్,మాణిక్యం రెడ్డి,కాల భైరవ,ఎంగిలి లక్ష్మణ్,క్యాసాని శ్రీనివాస్,కొలిచెలిమి మల్లిఖార్జున్,కానుకుంట్ల రమేష్, మట్టే వేణు గోపాల్,బబ్బూరి సురేష్,శ్రీకాంత్,బొజ్జ శివ ప్రసాద్,మల్లారెడ్డి,వల్లపు అశోక్,మాటూరి ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ 100 సంవత్సరాల వేడుకలను జయప్రదం చేయండి

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి

దేవరకొండ నవంబర్ 05 వార్త మిర్రర్ :దేవరకొండ పట్టణం లో స్థానిక సిపిఐ కార్యాలయం లో మంగళవారం నాడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అధ్యక్షతన సిపిఐ దేవరకొండ నియోజకవర్గం మండలాల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్ల నరసింహారెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగనా నిలబడిందని ప్రజల కోసం ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ ఈ సంవత్సరం డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున 100 సంవత్సరాల వేడుకలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు తెలంగాణ రాష్ట్రంలో దున్నేవారికి భూమి కావాలని భూమి కోసం భుక్తి కోసం వేటి చాకిరీ విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులు అయ్యారు అని భారత దేశ పరిరక్షణ కోసం దేశ సంపాదన కాపాడడం కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పాటుపడుతుందని పేర్కొన్నారు. నేటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాల కు నిరసనగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతున్నాదని దోపిడీ లేని సమాజం కోసం మనిషి మనిషిగా బతికే సోషలిస్టు వ్యవస్థ స్థాపన లక్ష్యంగా సిపిఐ పోరాడుతుందని అన్నారు. రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభించినప్పటికీ తేమ పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని




నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ధరలు అదుపు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలము అయ్యారని విమర్శించారు డిసెంబర్ 26న వాడవాడల ఎర్రజెండా ఎగురవేసి ప్రదర్శనలు బహిరంగ సభలు సమావేశాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి పల్ల దేవేందర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామావత్ అజయ్ నాయక్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి మైనుద్దీన్ దీప సుదర్శన్ రెడ్డి ఎస్ కనకాచారి తూమ్ బుచ్చిరెడ్డి పోలే వెంకటయ్య గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి బొమ్మ అచ్చయ్య జయరాములు నూనె రామస్వామి వలమల్ల ఆంజనేయులు విజయేందర్ రెడ్డి శైలేష్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్యా నాయక్ భౌతిక కాయాన్ని నివాళులర్పించినఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నవంబర్ 05 వార్త మిర్రర్ :దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి, బుడ్డ తండా గ్రామానికి చెందిన నేనావత్ నర్యా నాయక్ వాగులో పడి మృతి చెందిన విషయం తెలుసుకొని నేడు వారి స్వగృహంలో నేనావత్ నర్యా నాయక్ భౌతిక కాయాన్ని నివాళు లర్పించి,బాధిత కుటుంబానికి పరామర్శించి,భరోసా కల్పించి,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.వారితో పాటు మున్సిపాల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,మాజి ఎంపీపీ జాని యాదవ్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు హన్మంతు వెంకటేష్ గౌడ్,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ శిరందాస్ కృష్ణయ్య,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ,మాజి సర్పంచ్ దిప్లా నాయక్, ఆంజనేయులు,మాజి ఉప సర్పంచ్ చిన్న నాయక్, సాక్య,బాలు, టిక్య,మహేందర్ నాయక్,మాజి కో ఆప్షన్ సభ్యులు శ్యాంశీర్ అలీ, మాజి ఎంపీటీసీ సీత్యా నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీను నాయక్,అశోక్ గౌడ్,యువజన విభాగ నాయకులు సాయి రాథోడ్,బాబు రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# డైమండ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా మీల్స్ ఆన్ వీల్స్ , టెన్త్ విద్యార్థులకు జామెట్రీ బాక్సులు ప్యాడ్లు ,పెన్నులు అందజేత

మిర్యాలగూడ, నవంబర్ 5:-( వార్త మిర్రర్- మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల సహాయకులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం కోఆర్డినేటర్ మాశెట్టి శ్రీనివాస్ డైమండ్ నేతృత్వంలో ప్రారంభించి 2 సంవత్సరాల నుండి ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమం ఎంతో అష్ట కష్టాలతో చలి, వాన, ఎండాకాలం, పండుగలలో సైతం కార్యక్రమాన్ని నిరంతరాయంగా మాశెట్టి శ్రీనివాస్ డైమండ్ కొనసాగిస్తూ లయన్ లీడర్లు, పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.కీ.శే. ముదుంబై రామానుజాచార్యులు నాటి లయన్స్ డిస్టిక్ గవర్నర్ తీగల మోహన్ రావు చేతుల మీదుగా ప్రారంభమైన మీల్స్ ఆన్ వీల్స్ 2 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు.పీడీజిలు తీగల మోహన్ రావు, కేఎన్6 ప్రసాద్, సిహెచ్వి ప్రసాద్, లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యరాల ప్రభాకర్ రెడ్డిల సహకారంతో నిర్విరామంగా మీల్స్ అన్ వీల్స్ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. మంగళవారం కార్యక్రమంలో దాతలు కీర్తిశేషులు బాల నరసయ్య నాయుడు, ఎం.శేఖర్ రెడ్డిలు ఉచిత అల్పాహారం అందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కీర్తిశేషులు ముదుంబై రామానుజాచార్యుల జ్ఞాపకార్థం మంగతాయారు కుటుంబ సభ్యులు జడ్పీహెచ్ఎస్ బకల్వాడ పదో తరగతి 300 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెట్రి బాక్సులు కేఎన్.ప్రసాద్, దామరచర్ల మండల విద్యాధికారి బాలాజీ నాయక్, లయన్ లీడర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ చెందిన లయన్స్ 5 క్లబ్బుల పిఎస్టిల సభ్యులు, తరుణ క్లబ్ సామా శ్రీనివాస్, కేమా వెంకటేశ్, బిఎం.నాయుడు కుటుంబ సభ్యులు మురహరి దంపతులు ముక్కపాటి వెంకటేశ్వర్లు, లింగయ్య, కుట రాంబాబు, మల్లారెడ్డి, వనిత క్లబ్ గీత, సేవిత, సుజాత, స్వప్న, మంగతాయి, సుందరి నాగయ్య, సింగు రాంబాబు, గట్టు




వెంకటేశ్వర్లు, మధు, డాక్టర్ జె.రాజు, బకల్వాడ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ. కరుణాకర్ రెడ్డి, విద్యార్థులు బారాసింగ్, వంశీ, రాంరెడ్డి ఎల్వాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫిజు రియంబర్స్ మెంట్, బకాయిలు వెంటనె విడుదల చేయాలి

## ఎమ్మెస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుకొల్లూరు వెంకటేష్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 5... ఎమ్మార్పీఎస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెస్ ఎఫ్ టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూరాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ,పేద వర్గాల విద్యార్థుల కు ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ. 7500 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంవారి సంక్షేమం పట్ల నిర్లక్ష్యాన్ని చేస్తూ ఈ విద్యారంగా అభివృద్ధికి నిధులు కేటాయించడంలో ప్రస్తుత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తు%శీ%దన్నారు.గత ప్రభుత్వం విద్యా రంగాన్ని పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందని,కాంగ్రెస్ అధికారం లోకి వస్తే బ్రహ్మ రథం పడుతానని గొప్పలు చెప్పిన సీఎం పెండింగ్ ఫీజు బకాయిలు పై మాట నిలుపుకోవాలని కానీ మాట మార్చడం సరియైన వైఖరి కాదని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫిజు రియంబర్స్ మెంట్, బకాయిలు వెంటనె విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు తమ చదువులు పూర్తి చేసి సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్నారు, కాలేజీ యాజమాన్యాలు మాత్రం మొత్తం ఫిజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసి చెబుతున్నారని చెప్పారు.ప్రభుత్వం మాత్రం ఈ విషయం పై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి%శీ%చటం సరికాదు అని అన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్ దృష్టి ఉంచుకుని వెంటనే గత 5 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న సుమారు 7500 కోట్లు ఫిజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరిస్తున్నామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడేల్లి తిరుమలేశు , రాష్ట్ర యూనివర్సిటీల కో ఆర్డినేటర్ జీవన్, ఓయూ అధ్యక్షులు ల్, నాగరాజు, జిల్లా అధ్యక్షులు కె. సురేష్,మని, పనిందర్, భాను, ప్రవీణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి: ధర్మారపు శ్రీకాంత్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 5 ...ధర్మారపు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన ఉస్మానియా యూనివర్సిటీ విసి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బషీర్ బాగ్ న్యాయకళాశాల , ఉస్మానియా యూనివర్సిటీకి విద్యార్థుల సమస్యలపైనా చర్చించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని అన్ని రకాల కోర్సుల వారికి అన్ని కాన్స్టెంట్ కళాశాలలకు హాస్టల్, మెస్ వసతి కల్పించి కేవలం బషీర్ బాగ్ పీజీ న్యాయ కళాశాలకు అలాంటి అవకాశాలు కల్పించక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేరుకు ఆదిలో వెలసిన కళాశాలగా పేరున్న కానీ, అవకాశాలన్నీ దూరంగా ఉన్నాయని రాష్ట్రంలో ఉన్న ఒక్కగానొక్క చారిత్రాత్మక కళశాలకు యూనివర్సిటీ అవకాశాలను కల్పిస్తే మళ్లీ విద్యార్థుల పోరాటం రావొద్దు అని , కళాశాలలో ఉన్న 60 సీట్లను భర్తీ చేస్తూ మంచి వసతులను కల్పిస్తూ విద్యనందిస్తే విద్యార్థులు చదువుకొని యూనివర్సిటీకి మంచి పేరు తీసుకొస్తారని అన్నారు, కాబట్టి పిజి న్యాయ కళాశాలపై తీసుకునే నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్ కి పునాదులు పడుతూ, కొత్త ఆవిష్కరణలు చేసేలా ఉపయోగపడేలా ఉండాలని కోరారు. అధునాతన డిజిటల్ లైబ్రరీ,విద్యార్థులకు యూనివర్శిటీలో భోజనం మరియు వసతి గృహాల సౌకర్యం,అన్ని అర్హతలు ఉన్న ప్రిన్సిపాల్, రెగ్యులర్ ప్రొఫెసర్స్,యూనివర్సిటీ నుండి న్యాయ కళాశాలకు నిధులు కేటాయించాలని కోరారు. డిమాండ్ ఉన్న బిబిఎ హానర్స్ కొత్త కోర్స్ ను ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు.పై అనేక సమస్యలతో న్యాయ విద్యార్థులు పోరాటం చేస్తున్నారని ఇది చాలా బాధాకరమని అందరూ ఎస్సీ ఎస్టీ, బిసీ ఉన్నారు కాబట్టి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పవన్,ప్రదీప్,క్రాంతి,గణేష్,శశి,అనాస్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలి


## సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 05: చౌటుప్పల మండలం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు లో తాళ్ల సింగారం, పంతంగి, అంకిరెడ్డిగూడెం ,గుండ్ల బావి, స్వాములవారి లింగోటం ,నేలపట్ల, మందోల్లగూడెం, కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి సందర్శించడం జరిగింది. తనంతరం మాట్లాడుతూ రైతులు తమ ధాన్య రాశులలో తాలు,తేమా మట్టిపెడ్డలు లేకుండా తమ ధాన్యాన్ని శుభ్రపరచుకోవాలని రైతులకు తెలిపారు. తేమశాతం 17 లోపు ఉండేటట్టు రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టుకోవాలని అన్నారు.అదేవిధంగా రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలియజేశారు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, కల్పించాలని తెలిపారు. సీరియల్ నెంబర్ ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టుకొని పట్టుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వారికి తెలిపారు. ఏఈఓ లు ధృవీకరించిన ధాన్యాన్ని తూకం వేసి కేటాయించిన రైస్ మిల్లుకు పంపవలసినదిగా కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు తెలిపారు.గన్ని బ్యాగులను ఎప్పటికప్పుడు కొరత లేకుండా సివిల్ సప్లై వారి నుండి తెప్పించుకోవలసినదిగా సెంటర్ ఇన్చార్జిలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వై రమేష్ పాల్గొన్నారు.

# శ్రీశైలం, సాగర్‌ను ఖాళీ చెయ్యొద్దు



## నీటిని తాగు, సాగుకే వాడండి

## వానాకాలం దాకా పొదుపు పాటించండి

## తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ

## పోటాపోటీగా నీటి విడుదలపై ఆందోళన

హైదరాబాద్, నవంబరు 5 : శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని తాగు, సాగు నీటి అవసరాలకు మాత్రమే వాడాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలను కోరింది. 2025 వానాకాలం దాకా రిజర్వాయర్లలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జలవిద్యుత్ ఉత్పాదన చివరి ప్రాధాన్యంగా ఉండాలని సూచించింది. కేఆర్ఎంబీ సభ్యుడు డాక్టర్ ఆర్.ఎన్.శంకువ ఈ మేరకు తెలుగు రాష్ట్రాల ఈఎన్సీలకు వేర్వేరుగా లేఖలు పంపారు. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద అవసరమున్నా లేకున్నా పోతిరెడ్డిపాడు నుంచి ఇరువైపులా జలవిద్యుత్ ఉత్పాదనతో నీటిని దిగువకు వదులుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, సాగర్‌లో ప్రధాన కేంద్రంతో పాటు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో జల విద్యుత్ ఉత్పాదన చేస్తున్నారని తెలిపారు. ఇలా పోటీ పడి తెలుగు రాష్ట్రాలు నీటి నిల్వలను దిగువకు వదులుతుండడంపై కేఆర్ఎంబీ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే జలవిద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని, అవసరం లేకుండా ఇతర కాంపోనెంట్ల ద్వారా నీటి తరలింపును ఆపాలని కోరింది. నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని అలాగే దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ లోనూ పూర్తి స్థాయి నిల్వలు ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇలా నీరు వృథా అవుతున్న నేపథ్యంలో కేఆర్ఎంబీ తెలుగు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.



## లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

## కందుకూరు గ్రామంలో 110 మంది కి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

దేవరకొండ నవంబర్ 05 వార్త మిర్రర్ లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర దేవరకొండ ఆధ్వర్యంలో మంగళవారం నాడు డిండి మండలం కందుకూరు గ్రామంలో సముద్రాల వనజ పుట్టినరోజు సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని స్థానిక గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గ్రామంలోని ప్రజలకు పరీక్షలను నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ప్రెసిడెంట్ శివ పార్వతి మాట్లాడుతూ కందుకూరు గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా 110 మందికి ఉచిత నేత్ర వైద్య చికిత్సలు నిర్వహించామని అందులో 14 మందికి శాస్త్ర చికిత్స చేయాల్సిందిగా నిర్ధారించారని ఆమె తెలిపారు.లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర సేవలను గ్రామీణ ప్రజలు ఉపయోగించుకోవాలని అని ఆమె అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ద్వారా పరీక్షలు నిర్వహించి వేలాది మందికి కంటి చూపును అందించింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వైస్ ప్రెసిడెంట్ సముద్రాల వనజ వనం యాదమ్మ డాక్టర్ హరి శిరందాసు సుదర్శన్ కందుకూరు గ్రామ మాజీ సర్పంచ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మున్సిపాలిటీ సిపిఎం పార్టీ కార్యదర్శిగా గోశిక కరుణాకర్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం చౌటుప్పల మున్సిపాలిటీ రెండవ మహాసభ తంగడిపల్లి రోడ్డులో గల పిబి గార్డెన్స్ లో జరిగింది ఈ మహాసభలో 15 మంది సభ్యుల తోటి కమిటీ ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా గోశిక కరుణాకర్ ని చౌటుప్పల మున్సిపాలిటీ సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌటుప్పల్ లో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు వృద్ధాప్య వితంతు వికలాంగుల పెన్షన్లు ఇవ్వాలని చౌటుప్పల మున్సిపాలిటీలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాన్ని పూర్తి చేయాలని నాగులకుంటను చౌటుప్పల్ చెరువుని పర్యాటక కేంద్రాలుగా మార్చాలని చౌటుప్పల తలసింగారం లింకు రోడ్డుని తారు రోడ్డుగా త్వరగా పూర్తి చేయాలని స్థానిక పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యాన్ని అరికట్టాలని గాంధీ పార్కును అభివృద్ధి చేయాలని ఉద్యమ కర్తవ్యాలలో మహాసభ తీర్మానం చేసింది అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో సిపిఎం పార్టీని పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు.ఈ మహాసభలు మున్సిపాలిటీ కమిటీ సభ్యులుగా ఎండి పాషా బండారు నరసింహ దండ అరుణ్ కుమార్ గోపగోని లక్ష్మణ్ ఆకుల ధర్మయ్య అవ్వారి రామేశ్వరి బత్తుల దాసు ఉష్కా గులా శ్రీనివాస్ ఎండి ఖయ్యూం పర్ని ధర్మారెడ్డి చింతకింది శారద తూర్పునూరు మల్లేశం ఎండి రేష్మ ఎన్నుకోవడం జరిగింది ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్ మాటూరి బాలరాజు అనురాధ మల్లేశం జిల్లా నాయకులు మున్సిపాలిటీ పార్టీ సభ్యులు పాల్గొనడం జరిగింది




## డాక్టర్ రెడ్డీస్ లాభం 1341 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 5: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.1,341.5 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,480 కోట్లతో పోలిస్తే 9.35 శాతం తగ్గింది. లాభంలో నిరాశే ఎదురైన సంస్థకు ఆదాయంలో కాస్త ఊరట లభించింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 17 శాతం ఎగబాకి రూ.6,880 కోట్ల నుంచి రూ.8,016 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ సందర్భంగా కంపెనీ కో-ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ..ఉత్తర అమెరికా మార్కెట్లో ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో కోత పడిందని, అయినప్పటికీ అన్ని విభాగాలు ఆశాజనక పనితీరు కనబరిచాయన్నారు. మరోవైపు, నికోటినెల్, ఇతర బ్రాండ్‌ల విలీనం పూర్తి కానున్నదన్నారు.

### గ్లోబల్ జనరిక్ ఆదాయం కిక్కు

అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలను విక్రయించడంతో భారీ స్థాయిలో ఆదాయం సమకూరింది. గత త్రైమాసికానికి వీటి ద్వారా రూ.7,157 కోట్లు లభించినట్లు పేర్కొంది. దీంట్లో ఉత్తర అమెరికా నుంచే సగం రూ.3,728 కోట్లు లభించడం విశేషం. మిగతాదాంట్లో యూరప్ నుంచి రూ.577 కోట్లు సమకూరగా, భారత్ నుంచి రూ.140 కోట్లు లభించాయి. ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ అండ్ యాక్టివ్ ఇంగ్రిడియెంట్స్ ద్వారా వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 16.76 శాతం పెరిగి రూ.1,103 కోట్లకు చేరాయి.

## హిందుస్థాన్ జింక్‌లో అమ్మకానికి ప్రభుత్వ వాటా

### నేటి నుంచి బిడ్డింగ్ మొదలు.. ఒక్కో షేర్ ధర రూ.505




న్యూఢిల్లీ, నవంబర్ 5: హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్‌ఎల్)లో 2.5 శాతం వరకు వాటాను కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తున్నది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా జరిగే ఈ విక్రయంలో ఒక్కో షేర్ ఫ్లోర్ ధరను రూ.505గా నిర్ణయించారు. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) ట్రేడింగ్‌లో మంగళవారం ముగిసిన ధర (రూ.559.45)తో పోల్చితే ఇది 9.7 శాతం తక్కువ. సోమవారం ట్రేడింగ్‌తో చూస్తే సంస్థ షేర్ విలువ 2.99 శాతం లాభపడటం గమనార్హం. కాగా, రెండు రోజులపాటు జరిగే ఈ ఓఎఫ్‌ఎస్ ద్వారా రూ.5,000 కోట్ల నిధులను మోదీ సర్కారు సమీకరించే వీలున్నది. బుధవారం సంస్థాగత మదుపరులు (నాన్-రిటైల్ ఇన్వెస్టర్లు), గురువారం రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్డింగ్ చేసుకోవచ్చు. ఇదిలావుంటే అమ్మేస్తున్న 2.5 శాతం వాటాలో ఈక్విటీ 1.25 శాతంగా ఉంటే, మరో 1.25 శాతం గ్రీన్‌షూ ఆప్షన్‌గా ఉందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే 'ఎక్స్' వేదికగా తెలిపారు.